నేడు నందిగామలో రథోత్సవం

రథాన్ని సిద్ధం చేస్తున్న ఆలయ అధికారులు

నందిగామటౌన్(నందిగామ రూరల్): పట్టణంలో వేంచేసియున్న శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వర స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించే రథోత్సవానికి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా రథోత్సవానికి ఎంతో విశిష్టత ఉంది. పలు రకాల పుష్పాలు, విద్యుద్దీప కాంతులతో శోభాయమానంగా అలంకరించిన రథంపై స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఉంచి ఆలయం వద్ద నుంచి చందర్లపాడు బస్టాండ్ వద్దనున్న పారువేట మండపం వరకు పెద్దఎత్తున వైభవోపేతంగా రథోత్సవాన్ని నిర్వహించనున్నారు.

రూ.25లక్షలతో నూతన రథం..

రెండేళ్ల కిందట 2023లో జరిగిన కల్యాణోత్సవాలలో రథం మరమ్మతులకు గురికావడంతో ఆలయ అధికారులు చిన్నరథంపై రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా నడుచుకున్న ఆలయ అధికారులపై అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా సుమారు రూ.25లక్షల నిధులతో ఆలయానికి నూతన రథాన్ని తయారు చేయించారు. మరుసటి ఏడాది స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని సంప్రదాయ బద్ధంగా జరిపించారు. అంతే కాకుండా ఏటా ట్రాక్టర్‌తో రథాన్ని లాగుతుండగా, నూతన రథాన్ని పురాతన కాలం నుంచి వస్తున్న ఆనవాయితీ ప్రకారం మనుషులతో లాగించి రథోత్సవ కార్యక్రమంలో సంప్రదాయానికి పెద్దపీట వేశారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జరగనున్న రథోత్సవం కోసం ఆలయ సిబ్బంది, కళాకారులు కలిసి రెండు, మూడు రోజులుగా రథాన్ని ముస్తాబు చేస్తున్నారు. వేలాది మంది భక్తుల శివ నామ స్మరణ, మంగళవాయిద్యాల నడుమ ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి.



రథోత్సవానికి సిద్ధమవుతున్న రథం

కనులపండువగా కల్యాణోత్సవాలు

నందిగామటౌన్(నందిగామరూరల్): పట్టణంలో వేంచేసియున్న శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. కళ్యాణోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అమ్మవారిని పార్వతీదేవిగా అలంకరించి కుంకుమార్చన పూజలు చేశారు. ఎదురు కోలోత్సవం, రాత్రి 11.05గంటలకు స్వామి, అమ్మవారి కల్యాణాన్ని వేదమంత్రోచ్చరణల నడుమ కనులపండువగా నిర్వహించారు. అనంతరం చిన్న రథంపై ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుంచి రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈవో గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీ రాఘవ కుమార్, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



రామలింగేశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

క్లుప్తంగా

అమ్మవారికి సారె సమర్పణ



నందిగామటౌన్(నందిగామరూరల్): పట్టణంలో వేంచేసియున్న శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా పట్టణంలోని లలితా విష్ణు వాసవి జ్ఞానవాహిని మహిళా మండలి సభ్యులు సోమవారం అమ్మవారికి సారె సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు, పండ్లు, చీర తదితరాలను మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి ఉపప్రధానార్చకుడు దండిబొట్ల బాలకృష్ణ శాస్త్రికి అందజేశారు. అనంతరం స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళా మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆసుపత్రి ప్రారంభం



కంచికచర్ల : రోగుల ప్రాణాలను నిలబెట్టే ఆసుపత్రులు ఆలయాలతో సమానమని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. కంచికచర్లలో ఏర్పాటు చేసిన ఆదిత్య స్పెషాలిటీ ఆసుపత్రిని సోమవారం ఆమె రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రజలకు సేవలందించే ప్రైవేటు వైద్య సంస్థలకు ప్రభుత్వం మద్దతు ఇస్తుందన్నారు. ఆసుపత్రి ప్రతినిధులు డాక్టర్ కె.అశోకనాయుడు, డాక్టర్ శివప్రీతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన 'మిక్' విద్యార్థులు



కంచికచర్ల : తమ కళాశాలలో విద్యార్థులకు అత్యుత్తమ సాంకేతిక విద్యనందించడంతో పాటు పలు క్రీడా విభాగాల్లో నాణ్యమైన తరీ ఏదు ఇస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీకిరణ్ తెలిపారు. ఒంగోలు క్విస్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచిన మిక్ విద్యార్థులను సోమవారం కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ పోటీల్లోనూ తమ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్, కాంస్య పతకాలను సాధించారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ డి.పాండురంగారావు, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ ఎం.సుహాస్, పీడీలు నిమ్మగడ్డ శౌరయ్య, అదనపు పీడీలు హనుమంతరావు, సురేష్‌కుమార్, ఎం.వెంకటరమణ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అరుణకుమార్‌కు సత్కారం

నందిగామరూరల్: ప్రభావవంతమైన ప్రజాస్వామ్య నాయకత్వం కోసం చట్టసభల సభ్యులను శక్తివంతం చేసేందుకు కెపాసిటీ ఎన్‌హాన్స్‌మెంట్ ప్రోగ్రాం దోహదపడుతుందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. జాతీయ లెజిస్లేటివ్ కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని పూణేలో ఆదివారం నుంచి రెండురోజులపాటు నిర్వహించిన కెపాసిటి ఎన్‌హాన్స్‌మెంట్ ప్రోగ్రాంకు ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయా రాష్ట్రాల ప్రతినిధులు ఎమ్మెల్సీ అరుణకుమార్‌ను ఘనంగా సత్కరించారు. అరుణకుమార్ మాట్లాడుతూ సభ్యులలో శాసన చతురత బలోపేతం, ఉత్తమ పద్ధతులను అవలంభించడంతోపాటు పాలనా ప్రభావాన్ని పెంపొందించడమే ఈకార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమానికి హాజరుకావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తనను సత్కరించిన ఆయా రాష్ట్రాల ప్రతినిధులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.



ఎమ్మెల్సీ అరుణకుమార్‌ను సత్కరిస్తున్న ఆయా రాష్ట్రాల ప్రతినిధులు

విద్యుత్‌శాఖ విజిలెన్స్ దాడులు

రూ.8.28లక్షలు జరిమానా

కంచికచర్ల: కంచికచర్ల మండలంలో విద్యుత్ వినియోగదారులు, గృహాలు, వాణిజ్య సముదాయాల్లో విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్ఈ బి.విజయకృష్ణ, ఈఈ విజయకుమారి ఆధ్వర్యంలో 42 బృందాలుగా ఏర్పడి 2,542 గృహ సర్వీసులు, 450 వాణిజ్య సముదాయాల్లోని విద్యుత్ కనెక్షన్లను తనిఖీలు చేశారు. వాటిలో 324 సర్వీసులకు అదనపు లోడు 414 కిలో వాట్స్ మొత్తానికి రూ. 8.28 లక్షల జరిమానా విధించినట్లు విజిలెన్స్ ఎస్ఈ విజయకృష్ణ తెలిపారు. అనంతరం స్థానిక ఓసీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజిలెన్స్ ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామాజిక నేరమన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగినట్లయితే 94408 12362, 94408 12363 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. తమకు సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని వివరించారు. ఈ తనిఖీల్లో విజయవాడ రూరల్ ఈఈ ఎం.వసంతరావు, ఇబ్రహీంపట్నం డీఈఈ కె.వై.కొండలరావు, కంచికచర్ల ఏఈ బి.దిబ్బయ్య, విజయవాడ రూరల్ పరిధిలోని డీఈలు, ఏఈఈలు, జేఈఈలు లైన్‌ఇన్స్‌పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు

ఘనంగా ఇరుముడులు కార్యక్రమం

నందిగామరూరల్: మండలంలోని అడవిరావులపాడు గ్రామం తిరుపతమ్మ శరణుఘోషతో మార్మోగింది. గ్రామంలో సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో సోమవారం గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి దీక్ష మాలధారుల ఇరుముడి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మాలధారులకు గురుస్వామి ఇరుముడులు కట్టారు. అనంతరం ఇరుముడి సమర్పించేందుకు పెనుగంచిప్రోలులో వేంచేసియున్న గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి దీక్షా స్వాములు బయలుదేరి వెళ్లారు. ఇరుముడుల కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ మండలం రోజులు నియమనిష్ఠలతో దీక్ష చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆకుల హనుమంతరావు, సర్పంచ్ సూరా వెంకటనర్సమ్మ, నాయకులు సూరా కొండ, కృష్ణ, పలువురు నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పాడిరైతులకు సత్కారం



బండిపాలెం(జగ్గయ్యపేట): పాడిరైతులు పాల ఉత్పత్తిని మరింత పెంచాలని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సూచించారు. యూనియన్ వజ్రోత్సవ వేడుకలలో భాగంగా గ్రామంలోని పాల కేంద్రంలో సోమవారం పాడి రైతులను సత్కరించారు. పాడి రైతులతో కలిసి కేక్ కట్ చేశారు. పాలకవర్గ సభ్యులు నెలకుదిటి నాగేశ్వరరావు, ఇంజం రామారావు, కోకా వెంకటేశ్వరరావు, సామినేని కోటేశ్వరరావు, అడుసుమల్లి కృష్ణకుమారి, జనరల్ మేనేజర్ అన్వేష్, చిల్లకల్లు మేనేజర్ నరేష్ పాల్గొన్నారు.

సాగునీటి వృథాను అరికట్టాలి

పెనుగంచిప్రోలు: రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని మునేరు ప్రాజెక్టు చైర్మన్, వైస్ చైర్మన్లు పొన్నం బాలాజీ, మాలేశ్వరరావు సూచించారు. పంటలు చేతికొచ్చే సమయంలో సాగునీటికి ఇబ్బంది పడుతున్నామని మునేరు ఆయకట్టు చివరి గ్రామాలైన మాగల్లు, రుద్రవరం, సోమవరం, గొల్లమూడి, పల్లగిరి గ్రామాల రైతులు తమ సమస్యను చైర్మన్, వైస్‌చైర్మన్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో స్పందించిన వారు నీరు వృథాగా పోతున్న ఆయా తూముల వద్దకు వెళ్లి లస్కర్‌లు, రైతులు సాయంతో వాటిని మూసి వేయించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆయకట్టు చివరి భూములకు నీరు అందించేందుకు రైతులంతా సహకరించాలని కోరారు.

నులిపురుగు నివారణ మందుల పంపిణీ

పెనుగంచిప్రోలు: జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కెవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారి సృజన మాట్లాడుతూ మండలంలో 8034మందికి ఈ మాత్రలు వేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, 7825మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు వివరించారు. ఎంఈఓ డి.రవీంద్ర, హెచ్ఎం కె.జలజ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: మండలంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. ప్రభుత్వ వైద్యాధికారి అర్షిదా బేగం మాట్లాడుతూ 19ఏళ్లలోపు వయస్సు ఉన్న వారు మండలంలో 10.306 మంది ఉండగా వారిలో 9,918 మందికి మాత్రలను పంపిణీ చేసినట్లు వివరించారు. ఎంపీడీవో ఎస్.రాంబాబు, ఎస్‌హెచ్‌వో ఎస్ మల్లికార్జున్, హెల్త్‌సూపర్‌వైజర్ ఉషారాణి పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. భూచవరం ప్రభుత్వాస్పత్రి వైద్యులు అనిల్‌కుమార్ గండ్రాయిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. మండలంలో 12,184 మంది విద్యార్థులుండగా 11,953మందికి మాత్రలు అందజేసినట్లు తెలిపారు. సూపర్‌వైజర్లు వెంకట్రావ్, నాగలక్ష్మి, రమేష్, అలివేలమ్మ, నాగేశ్వరమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు. అనుమంచిపల్లిలో వైద్యాధికారి స్రవంతి చిన్నారులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు.

నందిగామ మండలంలో..

నందిగామరూరల్:నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గోళ్లమూడి, మాగల్లులో చిన్నారులకు నులిపురుగుల నియంత్రణ మందులను పంపిణీ చేశారు. గోళ్లమూడి పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌కృష్ణ, సీహెచ్‌వో వర్షిణీ మాట్లాడుతూ చిన్నారులందరికీ ఈ మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఏఎన్‌ఎం నరేంద్ర పాపాయి, ఆశావర్కర్లు ఆదిలక్ష్మి, అనిత పాల్గొన్నారు.



వత్సవాయిలో విద్యార్థులకు మందులు వేస్తున్న వైద్యాధికారి అర్షిదాబేగం, ఎంపీడీఓ రాంబాబు



పెనుగంచిప్రోలులో విద్యార్థులకు మందులు వేస్తున్న డాక్టర్ సృజన, ఎంఈఓ రవీంద్ర



అనుమంచిపల్లిలో నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి స్రవంతి

పుష్కర ఘాట్‌లు శుభ్రం

సాక్షి ఎఫెక్ట్

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలోని భవానీ ముక్తేశ్వర స్వామి వారి ఆలయ సమీపంలోని కృష్ణానది వద్ద పుష్కర ఘాట్‌లను పంచాయతీ అధికారులు సోమవారం శుభ్రం చేశారు. 'అధ్వాన్నంగా పుష్కర ఘాట్‌లు' శీర్షికన ఈనెల 8వతేదీన 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. సర్పంచ్ షేక్ అస్మతున్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి కలిసి పంచాయతీ సిబ్బందితో పుష్కర ఘాట్‌లను శుభ్రం చేశారు నది వద్ద నున్న వ్యర్థాలను కూడా తొలగించారు. మరో 13 రోజుల్లో స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభం కానుండటంతో నిత్యం పారిశుద్ధ్య పనులు చేపట్టనున్నట్లు వారు తెలిపారు.



రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలి

గౌరవరం(జగ్గయ్యపేట):రైతులు విధిగా రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖఏడీఏ భవానీ సూచించారు. గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో రైతు విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ విశిష్ట సంఖ్య ఆయా ప్రభుత్వ పథకాలు పొందేందుకు రైతులకు ఉపయోగపడుతుందని తెలిపారు. పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్‌నంబరుతో రైతుసేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఏడీఏ వెంట ఏవో వరలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

జగ్గయ్యపేట: స్థానిక విశ్వభారతి, జీఆర్‌సీ, అమ్మాణీ, వాగ్దేవి కళాశాలల్లో సోమవారం ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు.

దోషులను శిక్షించాలని డిమాండ్

నందిగామరూరల్: పరిటాల ఇంజినీరింగ్ విద్యార్థిని ఘటనలోని దోషులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపీనాయక్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళాభివృద్ధి, మహిళల రక్షణకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నేటికీ హామీలుగానే మిగిలిపోయాయే తప్ప ఆచరణకు నోచుకోవడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలపై వరుసగా అత్యాచారాలు చోటుచేసుకుంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను అమలుచేయాలని తెలిపారు. చిన్నారులు, విద్యార్థులు, మహిళలపై దురాఘతాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు షేక్ జాహిదా, ప్రేమ కుమార్, గోపి పాల్గొన్నారు.

కల్యాణ వేదిక పరిశీలన



పెనుగంచిప్రోలు:శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్నిశాఖల అధికారులు కృషి చేయాలని నందిగామ డివిజన్ ఆర్డీఓ కె.బాలకృష్ణ ఆదేశించారు. జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లుతో కలిసి సోమవారం ఆయన స్వామివార్ల కల్యాణోత్సవం నిర్వహించే వేదిక, భక్తుల వాహనాల కోసం ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. ఆలయ సిబ్బందికి, పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. సీఐ మాట్లాడుతూ కల్యాణోత్సవం సందర్భంగా విస్తృత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా విధులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి, ఆలయ ఈఓ కిషోర్‌కుమార్, ఈఈ ఎల్.రమ, ఏఈ రాజు, ఎస్ఐ అర్జున్ పాల్గొన్నారు.

దీక్షాపరులకు అన్నదానం



మక్కపేట(వత్సవాయి): పెనుగంచిప్రోలు శ్రీ గోపయ్య సమేత శ్రీ లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణోత్సవానికి విచ్చేస్తున్న దీక్షాస్వాములకు సోమవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన గజ్జి నాగరాజు కుటుంబసభ్యులు 200మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. దీక్షాస్వాములకు అన్నప్రసాదం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. ఆలయ నిర్మాణధర్మకర్త మల్లెల గాంధీ, అర్చకులు అత్తలూరి యుగంధర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలో ఉన్న అన్ని వార్డుల్లో ఈనెల 12వ తేదీ బుధవారం మధ్యాహ్నం తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు సోమవారం తెలిపారు. హెడ్‌వాటర్ వర్క్స్ పంపింగ్ స్కీం వద్ద మరమ్మతుల కారణంగా(మెయింట్‌నెన్స్) తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు వివరించారు. 13వ తేదీ ఉదయం నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా కొనసాగుతుందని తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.